డిబిటి విధానంలోనే ఉచిత గ్యాస్

- మొదట కొంటే తరువాత ఖాతాలో నగదు జమ
- పథకానికి మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలోనే ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం వెలగపూడి సచివాయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. ఈ దీపావళి (అక్టోబర్ 31) నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 6.74 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 2.4 లక్షల దీపం కనెక్షన్లు కూడా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5.77 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 1.55 లక్షల దీపం కనెక్షన్లు, 33,732 పిఎం ఉజ్వల యోజన కనెక్షన్లు ఉన్నాయి. తొలుత గ్యాస్ సిలిండర్‌ను మామూలుగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.25 రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుదారుల ఖాతాలో జమ చేసేలా నిర్ణయించింది. మూడు ఉచిత సిలిండర్లు కూడా ఒక దాని తరువాత ఒకటి కాకుండా నాలుగు నెలలకాలానికి ఒక సిలిండర్ చొప్పున ఇవ్వనున్నారు. దీపావళి రోజు నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీని ప్రారంభించనున్నారు. అందు కోసం మూడు రోజుల ముందు నుండే సిలిండర్ల బుకింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు డిబిటి ద్వారా లబ్ధిదారుల ఖాతాకు సిలిండర్ సొమ్మును జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మూడు బ్లాక్ పీరియడ్లుగా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి జులై వరకూ ఒక పీరియడ్, ఆగస్టు నుంచి నవంబర్ వరకూ ఒక పీరియడ్, డిసెంబర్ నుంచి మార్చి వరకూ ఒక పీరియడ్‌గా నిర్ణయించారు. ఒక్కో పీరియడ్‌లో ఒక్క ఉచిత గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నారు. డిబిటి విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తే ప్రభుత్వం సిలిండర్ కొనుగోలు చేసిన మొత్తాన్ని ఖాతాల్లో జమచేయకపోతే ఎలా అని వినియోగదారుల నుంచి సందేహం వ్యక్తం అవుతోంది. ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు రాకపోవడంతో ఈ పథకానికి అర్హులు ఎవరనేది స్పష్టత రాలేదు. విధివిధానాలు వచ్చే వరకూ తాము ఎలాంటి చర్యలు తీసుకోలేమని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

జన సమూహంలో ఉన్న

మద్యం షాపులను నియంత్రించాలి

- ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా వ్యాప్తంగా జన సమూహంలో ఉన్న మద్యం షాపులను నియంత్రించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవికి ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి. నిర్మల, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వైన్‌షాపులకు విచ్చలవిడిగా రాష్ట్ర ప్రభుత్వం పరిమిషన్ ఇచ్చారని ,ఈ షాపుల్లో మద్యం తీసుకొని వేరే చోటికి వెళ్లి తాగాలని, అక్కడే కొనుక్కొని కూర్చొని తాగుతున్నారని దాంతో రోడ్డుపైన తిరిగే మహిళలు, పిల్లలు, విద్యార్థులు, అభద్రత భావానికి గురవుతున్నారని అన్నారు. గుడి, బడి, హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో వైన్‌షాపులు పెట్టడానికి వీలులేదని నిబంధన ఉన్నా వైన్ షాపులు రద్దీ ఉన్న జన సమూహంలో పెట్టి బహిరంగంగానే కూర్చొని తాగుతున్నారన్నారు. ఇలాంటి వాటిపైన తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఆదోని పట్టణంలో 200 సంవత్సరాలు చరిత్ర కలిగిన శివాలయం దగ్గర ,ఆలూరులో బాలికల హాస్టల్ దగ్గర వైన్ షాపులు పెట్టారని, వీటిని అక్కడి నుండి తీసివేయాలని స్థానికులు ప్రజాస్వామ్యవాదులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం స్పందించడం లేదన్నారు. కర్నూలు నగరంలో ఉల్చాల రోడ్డు, వై.జంక్షన్ దగ్గర మొదలుకొని చెన్నమ్మ సర్కిల్, కొత్త బస్టాండ్, సుందరయ్య సర్కిల్, దగ్గర, గ్రీన్‌పార్క్, ప్రాంతాల్లో వైన్ షాపులు పెట్టారని ఈ ప్రాంతాలలో విద్యాసంస్థలు, హాస్పిటల్స్, నిత్యం జనం రద్దీగా ఉండడం వలన తాగిన వారు మహిళలను విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. వెంటనే ఈ సెంటర్స్‌లో ఉన్న మద్యం షాపులు వేరే ప్రాంతాలకి తరలించాలని కోరారు. లేనిపక్షంలో జనాలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు అరుణ మహిళా సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ ధనలక్ష్మి సుజాత, పద్మ, శ్యామల, అమీనా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

16 గేట్ల ద్వారా దిగువకు నీరు

- టిబి నుంచి 88,715 క్యూసెక్కులు విడుదల

దిగువకు వెళ్తున్న నీరు

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యాం నుంచి రోజుకు 88,715 క్యూసెక్కుల నీటిని 16 గేట్ల ద్వారా దిగువ విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 105 టిఎంసిలు కాగా ప్రస్తుతం 102 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,06,142 క్యూసెక్కుల నీరు తుంగభద్ర డ్యామ్‌కు వచ్చి చేరుతోంది. కర్ణాటక రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యామ్‌కు వరద పోటెత్తినట్లు బోర్డు అధికారులు తెలిపారు. వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. మరికొన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువ విడుదల చేసే ఆలోచనలో బోర్డు ఉన్నట్లు తుంగభద్ర బోర్డు సెక్షన్ ఆఫీసర్ రాఘవేంద్ర తెలిపారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

2,3న యుటిఎఫ్ జిల్లా మహాసభలు

- గూడూరు కేంద్రంగా మహాసభల నిర్వహణ
- ప్రభుత్వ పాఠశాల విద్యారంగా పరిరక్షణ ధ్యేయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్య పరిరక్షణతో పాటు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండాతో ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం జిల్లా మహాసభలను నవంబర్ రెండు మూడు తేదీల్లో నిర్వహించనున్నారు. గూడూరు మండల కేంద్రంలో జిల్లా మహాసభలను నిర్వహించేందుకు ఆ సంఘం జిల్లా నాయకత్వం ప్రణాళికను రూపొందించింది. రెండు రోజులపాటు జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో పలు అంశాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను ప్రకటించనున్నారు. యుటిఎఫ్ ఏర్పడి దాదాపుగా 50 సంవత్సరాలు పూర్తయిన పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ సంబరాలను నిర్వహించుకుంటుంది. ప్రభుత్వ పాఠశాల విద్య రంగాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగుతోంది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుండే ఏకైక సంఘం యుటిఎఫ్ గుర్తింపుపొందింది. ఈ సంఘం మద్దతుతోనే శాసనమండలిలో పట్టభద్రులు , ఉపాధ్యాయ నియోజకవర్గాల నుండి ఎమ్మెల్సీలను కూడా పంపడంలో తనదైన గుర్తింపు పొందింది. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయకుండా మరింత బలోపేతం చేయాలని మొదటి నుండి డిమాండ్ చేస్తుంది. పేదలకు విద్యా అందించాలని పాలకపక్షాలను ప్రశ్నిస్తుంది. పాఠశాల విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల గొంతుకగా ఈ సంఘం వ్యవహరిస్తుంది. కర్నూలు జిల్లాలో దాదాపుగా ఈ సంఘానికి 5,000 మందికి పైగా సభ్యత్వం కలిగిన అతిపెద్ద సంఘంగా అవతరించింది. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిపిఎస్ అమలుకు కార్యరూపం దాలుస్తూ గజిట్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన బాట పట్టగా ప్రభుత్వం వెంటనే దిగివచ్చి గజిట్‌ను రద్దు చేసింది. అలాగే ప్రాథమిక పాఠశాల విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జిఒ నెంబర్ 117ను కూడా రద్దు చేయాలని మొదటి నుండి డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుంది. మున్సిపల్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసిన తర్వాత ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఇటీవల కాలంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టింది.

స్కూల్ గ్రాంట్స్ కింద రూ 2.85 కోట్లు

- 26 ఎంఆర్‌సిలకు రూ33.8 లక్షల విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని 1363 పాఠశాలలకు స్కూల్‌గ్రాంట్ కింద రూ.2.85 కోట్ల నిధులు విడుదల అయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ మొత్తం రూ.5.70 కోట్ల నిధులకు గాను 50 శాతం నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. జిల్లాలోని ఎమ్మార్సీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి రూ1.3 లక్షల చొప్పున నిధులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎమ్మార్సీలకు రూ.33.8 లక్షల నిధులు విడుదల అయినట్లు ఆయన వెల్లడించారు. స్కూల్ గ్రాంట్ కింద విడుదలైన నిధులను ఆయా పాఠశాలల హెచ్ఎంల బ్యాంకు ఖాతాలకు నేరుగా సమగ్ర శిక్ష ద్వారా అందజేయనున్నామన్నారు. ఈ నిధులతో పాఠశాలల్లో విద్యుత్ చార్జీలతో పాటు మరమ్మతుల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఎంసిల ద్వారా ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

ఐఐటి మెడికల్ అకాడమీ అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

చిన్నటేకూరులోని ఐఐటి మెడికల్ అకాడమీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష విద్యార్థులకు తెలిపారు. ఐఐటి, మెడికల్ అకాడమీ ద్వారా శిక్షణ పొంది నీట్‌లో ప్రతిభ కనబరిచి మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అభినందించారు. ఈ విద్యార్థులందరిని కలెక్టర్ శాలువాతో సత్కరించి, పెన్నును బహుమతిగా అందచేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్యులుగా సమాజానికి సేవ చేయాలని సూచించారు. లాభాపేక్ష లేకుండా పేదలకు సేవలందించాలని సూచించారు. వైద్య రంగంలో పరిశోధనల వైపు దృష్టి సారించి, మరెన్నో వైద్య పద్ధతులను కనిపెట్టాలని సూచించారు. కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల ఐఐటి మెడికల్ అకాడమీలో అడ్మిషన్స్, సౌకర్యాల గురించి డిసిఒ, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది అకాడమీ నుండి 20 మంది విద్యార్థులు ఎంబిబిఎస్‌కు, 8 మంది విద్యార్థులు ఐఐటికి, 25 మంది విద్యార్థులు నిట్‌కు, ఏడుగురు విద్యార్థులు సియూసెట్, ఒకరు ట్రిపుల్‌ఐటి పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని డిసిఒ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డిసిఒ శ్రీదేవి, ఐఐటీ మెడికల్ అకాడమీ డైరెక్టర్ ప్రత్యూష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులకు మార్కెటింగ్

జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు హోల్ సేల్ మార్కెటింగ్ కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డిఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. బుధవారం డిఆర్‌డిఎ మార్కెటింగ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు వ్యాపార అవకాశాలు పెరిగే విధంగా లోకల్ మార్కెట్‌తో లింక్‌అప్ చేయాలన్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో మార్కెట్‌ను స్టడీ చేసి ఆయా షాపులు, సూపర్ మార్కెట్లకు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను టై అప్ చేయాలని కలెక్టర్ డిఆర్‌డిఎపిడి శ్రీధర్ రావును ఆదేశించారు. పది రోజుల లోపల ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

కర్నూలు మార్కెట్‌లో ఉల్లిని పరిశీలిస్తున్న ఎంపి బస్తిపాటి నాగరాజు, కార్యదర్శి

మార్కెట్ అభివృద్ధికి కృషి

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించిన ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. మార్కెట్‌ను బుధవారం ఎంపి బస్తిపాటి నాగరాజు సందర్శించి మార్కెట్‌కు వచ్చిన వివిధ రకాల పంటల రైతులను ఉల్లి రైతులను ధరలు, తూకాల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయని మాట్లాడారు. మార్కెట్ అంతటా తిరిగి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ పూర్తి సహకారం అందిస్తానన్నారు. పెండింగ్‌లో ఉండేగోడౌన్‌ను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ అభివృద్ధి చెందేలా తాను ఎప్పటికీ కషి చేస్తానని హామీఇచ్చారు. మార్కెట్ కార్యదర్శి ఆర్.జయలక్ష్మి మార్కెట్‌లో ఉండే సమస్యలను ఎంపి దృష్టికి తీసుకొచ్చారు. వాటిని తక్షణమే పరిస్కారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రెహమాన్, సూపర్ వైజర్లు కేశవ రెడ్డి, నగేష్ మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్నఅధికారులకు సన్మానం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పులిశేఖర్ ఎద్దుల దొడ్డికి బదిలీ అయ్యారు. పంచాయతీ సెక్రెటరీ రాజు నాయక్ పగిడి రాయికి బదిలీ అయ్యారు. విఆర్ఒ రెహమాన్ మారెళ్ళకి బదిలీ అయ్యారు. వారికి సచివాలయం సిబ్బంది, ప్రజలు సన్మానించారు. వారి స్థానంలో తుగ్గలి వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్ ,తుగ్గలి పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ , విఆర్ఒ నవీన్ పటేల్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు బురాన్ దొడ్డి విద్యార్థులు

ప్రజాశక్తి-సి బెళగల్ : 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడలకు బురాన్‌దొడ్డి హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని హెచ్ఎం నిర్మలా వసంత కుమారి బుధవారం మీడియాలో పేర్కొన్నారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ డిష్ వెంకటేష్ సమక్షంలో తొమ్మిదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయుల అధ్యక్షతన కోకోలో రాణించిన జి.ఇంద్రజను, సైక్లింగ్‌లో రాణించిన జి.వీరేశమ్మను, రగ్బీలోరాణించిన బి.నవీన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, కమిటీ ఛైర్మన్‌లు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎం లీలావతి, సి బంగారి

ప్రశాంతంగా నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు,నంద్యాల జిల్లా నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం కర్నూలు మెడికల్ కళాశాల, ఆడిటోరియంలో ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8-00 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 5-00 ఓటింగ్ నిర్వహించారు. మొత్తం ఓట్లు 321 ఉండగా 270 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో ఎపిఎన్‌జిఒ సంఘం మద్దతిచ్చిన ప్యానెల్ సభ్యులందరూ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ప్యానల్ నుండి ప్రెసిడెంట్ గా ఎం. లీలావతి 141 ఓట్లు, వైస్ ప్రెసిడెంట్ గా జి.శాంతి భవానీ 162 ఓట్లు, సెక్రటరీగా సి.బంగారి 152 ఓట్లు, ట్రెజరర్‌గా ఎస్.లక్ష్మినరసమ్మ 143 ఓట్లు ,ఇసి మెంబర్ లుగా ఎ.ఉమాదేవి 136 ఓట్లు, జె.ఉమారాణి 140 ఓట్లు, డి కృష్ణవేణి 136 ఓట్లు, ఎస్ సోమేశ్వరి 158 ఓట్లు, యుఎం.శాంతిలత 140 ఓట్లుతో వారి సమీప ప్రత్యర్థులపై గెలుపొందారు. రెండవ ప్యానల్ నుండి ప్రెసిడెంట్ గా పి ఆదిలక్ష్మమ్మ, వైస్ ప్రెసిడెంట్‌లు వి.శ్రీదేవి,సెక్రటరీగా డి.మంజుల దేవి,ట్రెజరర్‌గా జి.విజయమ్మ, ఇసి మెంబెర్ లుగా పి.లీలరాణి,కె. శ్రీదేవి, జి.రమణిదేవి, కె.సుజాత, ఎం. కళ్యాణిలు పోటీ చేసి ఓడిపోయారు, మొత్తం ఓట్లు 321 కాగా 270 ఓట్లు పోలయ్యాయి.

ఎన్నికయిన నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు, కార్యవర్గం

టెన్నిస్, క్రికెట్ అకాడమీలు నిరుపయోగం

పిచ్చి మొక్కలకు, పాములకు నిలయంగా మారాయి

ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు విన్నపం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వ్యాయామం, ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం కోసం పార్కులు, స్టేడియాలు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టినా అనుకున్న లక్ష్యానికి అవి ఉపయోగపడకపోగా పిచ్చి మొక్కలకు, పాములకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. నిరుపయోగంగా పడి ఉన్న స్టేడియంలలో ముఖ్యంగా జోరాపురం డంపింగ్ యార్డ్ పక్కన రామ్‌ప్రియనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ టెన్నిస్ అకాడమీ, మాస్టర్ బ్లాస్టార్ క్రికెట్ అకాడమీలు రూ.80 లక్షలు ఖర్చు చేసి టెండర్ వేశారు. టెండర్ దారు వాటిని కొంతకాలం నిర్వహించారు. ఆ సందర్భంగా అక్కడి వారే కాకుండా ఇతరులు కూడా వచ్చి ఆటలాడుతూ ఉదయం ,సాయంత్రం వయోవృద్ధులు ,మహిళలు, పిల్లలు వాకింగ్ చేస్తూ ప్రజలతో కళకళలాడుతూ ఉండేది. టెండర్ దారుడు నిర్వహణ చేయటం కష్టంగా మారి నష్టం రావడంతో రెండు నెలలుగా వాటికి తాళాలు వేశారు. దీంతో లోపల ఎలాంటి కార్యక్రమాలు క్రీడలు నిర్వహించకపోవడంతో దానికి తోడు వర్షాలు బాగా పడుతుండడంతో ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో, తీగలతో అలుముకొని పాములకు నిలయంగా మారింది. ఆ స్టేడియంలో నిర్వహణ బాధ్యతలు తీసుకునేందుకు ముందుకు వచ్చేంతవరకు పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించి కనీసం ఆ ప్రాంతంలో ఉన్న వారు ఉదయం సాయంత్రం వాకింగ్ చేసేందుకు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కమిషనర్‌ను కోరుతున్నారు. నగర పాలక సంస్థ సుందరంగా తీర్చిదిద్దిన స్టేడియాలను ఉపయోగంలోకి తీసుకువచ్చే విధంగా కమిషనర్ చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

వాకింగ్ చేసేందుకు బాధ్యతలు తీసుకుంటాం

ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్ఎ.సుభాన్

స్టేడియంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసి ఇచ్చినట్లయితే ఉదయం, సాయంత్రం మా ప్రాంత ప్రజలు వాకింగ్ చేసే విధంగా బాధ్యతలు తీసుకుంటాను. మా ప్రాంతంలో ఉండే వృద్ధులు, మహిళలు ,పిల్లలు కనీసం వాకింగ్ చేసేందుకు కూడా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దయచేసి ఉదయం సాయంత్రం స్టేడియానికి ఉన్న తాళాలను మాకు అప్పజెప్పాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రం ఇస్తే పరిశీలిస్తాం

రెవెన్యూ అధికారి జునీద్

సంబంధిత గుత్తేదారు తాను నిర్వహణ చేయలేనని రాసిచ్చినట్లు ఉంది. ఆ ప్రాంత ప్రజలు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తే పరిశీలించి కమిషనర్ ఆ స్టేడియం విషయంపై నిర్ణయం తీసుకుని వారికి అప్పజెపుతారు.

సదస్సుకు హాజరయిన పోలీసు అధికారులు, అధ్యాపకులు

'మీకోసం పోలీస్‌శాఖ' అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు ఆత్మకూరు రోడ్డు లోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో మీ కోసం పోలీస్ శాఖ అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ విజయలక్ష్మి ముఖ్య అతిధిగా హాజరయ్యారయి మాటాడారు. ట్రాఫిక్ నియమాలు, విద్య ప్రాముఖ్యత, సైబర్‌నేరాలు, బాల్య వివాహాలు, ప్రేమ పేరుతో మోసపోవడం, నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిస్కార మార్గాలను వివరించారు. తాను మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చి అనేక సమస్యలను ఎదుర్కొని ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదిగానని, తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రేమ, కానిస్టేబుల్ పుల్లమ్మ , కరెస్పాండెంట్ రాజమ్మ, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ సూరి, అధ్యాపకులు, ఇంటర్ డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్చం ఇస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు

కలెక్టర్ ను కలిసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, లక్ష్మిరాజులు బుధవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషను మర్యాదపూర్వకంగా కలిశారు. వారితోపాటు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రజనీకాంత్ రెడ్డి , కలెక్టరేట్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరాజు , కర్నూలు డివిజన్ ప్రెసిడెంట్ వి.రామాంజనేయులు , ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులు లోకేశ్వరి, బిఎల్.కృష్ణవేణి, శివపార్వతి, భానులు ఉన్నారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు.

బిఇడి సెమిస్టర్‌కు 375 మంది హాజరు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నుండి ప్రారంభమైన బిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షలకు 375 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షను మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించగా 4318 మంది హాజరు కావాల్సి ఉండగా 3943 మంది పరీక్షలకు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

• ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు ఉన్న నేపథ్యంలో డ్రైనేజీ, మ్యాన్ హోల్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లాక్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించే వాహనాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతన ట్రాఫిక్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి వారిని ఆస్పత్రులకు తీసుకెళ్లే సమయం జీరో అవర్/గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పరిపాలన అధికారి కె.వసుంధర, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఆర్‌టిఒ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, డిఎల్‌పిఒ కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప, అధికారులు పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి - నందవరం


పోలీసులను సన్మానిస్తున్న నాయకులు

నందవరం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన పోలీసులకు సన్మానం చేశారు. బదిలీ అయిన పోలీసులు పరమేష్, ఆనంద్, ఆంజనేయులు, నాగరాజ్, మల్లికార్జునను ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. డీఎస్పీ ఉపేంద్రబాబు పాల్గొని కేక్ కట్ చేసి, బదిలీ అయిన పోలీసులను శాలువాలతో సన్మానించారు. టిడిపి నాయకులు, దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ పాల్గొని మాట్లాడారు. బదిలీలు అయిన పోలీసులు విధుల్లో బాధ్యతగా వ్యవహరించి మండల ప్రజలకు సేవలు అందించారని తెలిపారు. ప్రజలతో స్నేహభావంతో ఉంటూ వారి మన్ననలు పొందారని చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారని తెలిపారు. దేశాయ్ యూత్ అధ్యక్షులు సాధిక్, తోట పాండు, కె.శివ, స్కూల్ ఛైర్మన్ పి.శివ, జెసిపి రాజు, దండు వీరేశ్, అబ్దుల్, సజీవ, ఇస్రాయిల్ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

- నీట మునిగిన పంట పొలాలు
- దిక్కు తోచని స్థితిలో రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో నీట మునిగిన పంట

తుఫాను ప్రభావంతో చిప్పగిరి మండలంలో వర్షం కురిసింది. అధిక వర్షాలతో పంట పొలాల్లోకి నీరు చేరి పంట మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడతో మండలంలోని నగరడోనా, తిమ్మాపురం, నేమకల్లు, బెల్డోన, కుందనకుర్తి, చిప్పగిరి గ్రామాల్లో జొన్న, కంది, పత్తి, పప్పు శనగ పంటలు నీట మునిగాయి. కొన్ని పొలాల్లో గతవారం క్రితం వేసిన పప్పు శనగ మొలక అంతా అధిక వర్షానికి కొట్టుకుపోయింది. జొన్న, పత్తి పంటలు నేలవాలి నీట మునిగాయి. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారు. వర్షాలతో పంటంతా దెబ్బ తినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **ఎమ్మిగనూరు** మండలంలోని బనవాసి శివారు ప్రాంతంలో కురిసిన వర్షాలకు వరి పంట నేలవాలింది. కోతకు వచ్చిన వరి పంటలు నాశమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రైతులు 1000 నుంచి 1500 ఎకరాల్లో వరి సాగు చేశారు. వర్షాలకు సాగు చేసిన వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎడిఎ, విఎఎ, పంచాయతీ సెక్రటరీ వరి పంట పొలాలను సందర్శించి పంట నష్టం అంచనా వేయాలని, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ఎమ్మిగనూరులో నేలవాలిన వరి పంట

టిడ్కో ఇళ్లల్లో చేరండి.. సదుపాయాలు కల్పిస్తాం...

• మున్సిపల్ ఛైర్మన్ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

ప్రజాశక్తి - ఆదోని

టిడ్కోలో కేటాయించిన వారందరూ టిడ్కో ఇళ్లల్లో చేరితే మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. బుధవారం టిడ్కో గృహ సముదాయంలో లబ్ధిదారుల సమస్యలను నివృత్తి చేశారు. తాగునీటి సమస్య ఉందని, ఇక్కడ చేరితే తాము నీటిఎద్దడితో ఇబ్బందులు పడాల్సి వస్తుందని లబ్ధిదారులు అధికారుల దృష్టికి తెచ్చారు. గృహాల ఫ్లోరింగ్ వాటర్ లీక్ అవుతుందని, మరమ్మతులు చేయించాలని విన్నవించారు. ఇక్కడ జనసంచారం లేకపోవడం వల్ల రాత్రి వేళలో దొంగల బెడద ఉండవచ్చని భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. విద్యుత్ మీటర్ల కోసం రుసుం కూడా చెల్లించామని, ఇంతవరకు మీటర్లు అమర్చకపోవడం వల్ల చీకటి గదిలో ఎలా ఉండేదని ప్రశ్నించారు. ఊరికి దూరంగా గృహ సముదాయం ఉండడం వల్ల రాకపోకలకు వాహన సదుపాయం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ మాట్లాడారు. గది పైకప్పు లీకేజీ ఉన్నట్లు గుర్తించామని, సత్వరమే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. తాగునీటి నల్లాకు సంపు ఏర్పాటు చేయించామని, వాలు ఓపెన్ చేస్తే ఇళ్లల్లోకి నీరు సరఫరా అవుతుందని, ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ ప్రాంతంలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రజల రాకపోకల కోసం ఆర్‌టిసి బస్సు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాత్రి వేళలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 300 గృహాలు నివాసయోగ్యంగా ఉన్నాయని, వారు చేరితే మిగతా వారు కూడా ఉత్సాహం చూపుతారని తెలిపారు. ఇక్కడ రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కూడా కల్పిస్తామని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ రామ్మూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ జనార్దన్, టిడ్కో డిప్యూటీ ఇంజినీర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసాద్, హరి నాయక్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, ట్రాన్స్‌కో ఎఇ పురుషోత్తం, ఎఇ లోకేష్, మెప్మా ఉద్యోగులు ఉన్నారు.

సమావేశానికి హాజరయిన లబ్ధిదారులు

సదుపాయాల గురించి వివరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

'పల్లె పండుగ' పనులు సకాలంలో పూర్తి

- రూ.1.5 కోట్లతో కొత్త పనులకు ప్రతిపాదనలు
- వలసల నివారణకు పనులు సిద్ధం
- ఎంపిడిఒ మణిమంజరి

ప్రజాశక్తి - గోనెగండ్ల

'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ మణిమంజరి తెలిపారు. బుధవారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి నసురుద్దీన్ అధ్యక్షత వహించారు. పంచాయతీరాజ్ ఎఇ శివశంకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండగ'లో భాగంగా వివిధ గ్రామాల్లో 16 పనులను రూ.2 కోట్లతో చేపట్టామని, అందులో నాలుగు పనులను ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన పనులను కూడా మరో నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. పనులు అవసరమైన మిగతా గ్రామాల్లో రూ.1.50 కోట్లతో కొత్త పనులను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఉపాధి హామీ ఏపీడీ అలీపీరన్ మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలు వలసలు వెళ్లకుండా పనులను సిద్ధం చేశామని తెలిపారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీల ద్వారా ఈ పనులను ఉపయోగించుకుని ప్రజలు వలసలు వెళ్లకుండా చర్యలు చేపడతామని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ఆగిపోయిన జలజీవన్ మిషన్ పనులను మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో తిరిగి పునరుద్ధరిస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ... మలేరియా, డెంగీ వ్యాప్తిని నిరోధించడానికి వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కలిగించడంతో పాటు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ విష్ణు ప్రసాద్, కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, ఎంఇఒ రామాంజనేయులు, ఎఒ హేమలత, హౌసింగ్ ఎఇ షేక్షావలీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేష్మ, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, సర్పంచి హైమావతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ మణిమంజరి

ప్రణాళికలు సిద్ధంగా ఉండాలి

• ప్రత్యేకాధికారి రాజా రఘువీర్

ప్రజాశక్తి - కౌతాళం

ఉపాధి హామీ చట్టం, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించి కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధంగా ఉండాలని ప్రత్యేకాధికారి రాజా రఘువీర్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్, హౌసింగ్ శాఖ సిబ్బందితో, ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లేబర్ రిపోర్టింగ్, ఫారం పాండ్స్, హార్టికల్చర్, పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా భూమి పూజ చేసిన సిసి రోడ్లు, డ్రైనేజీలు, బ్లాక్ ప్లాంటేషన్, క్యాటిల్ షెడ్స్, రూఫ్ టాప్ వాటర్, హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లు, ఫీల్డ్ అసిస్టెంట్ నియామకాల మార్గదర్శకాలపై ప్రత్యేకంగా చర్చించారు. వంద రోజుల పని దినాలకు కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఒ సుబ్బరాజు, మాధవ శంకర్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

డ్రైనేజీ నీటి కంపు

• ఇబ్బందులు పడుతున్న భక్తులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో డ్రైనేజీ నీటి వచ్చే కంపుతో భక్తులు, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నీటి నుంచి మోక్షం ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. బుధవారం స్థానిక ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీ ఛాంబర్ల బ్లాక్‌ను పంచాయతీ ట్రాక్టర్‌కు ఇనుప చువ్వ కట్టి ఛాంబర్‌లోకి పంపించి సిబ్బంది తొలగించారు. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం ఉన్న లాడ్జీలు, హోటళ్ళ, నివాస గృహాల సంఖ్యకు అనుగుణంగా పంచాయతీ ఆధ్వర్యంలో చిన్న పాటి డ్రైనేజీ పైపు లైన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లాడ్జీలు, హోటళ్లు, గృహాల సంఖ్య పెరిగింది. డ్రైనేజీ వ్యవస్థకు ప్లాస్టిక్ పేపర్లు, ఇతర వ్యర్థ పదార్థాలు అడ్డుపడి నీరు పారుదల లేక ప్రధాన రహదారిలో ఉన్న ఛాంబర్ల ద్వారా రోడ్డుపైకి వస్తున్నాయి. ఈ దుర్వాసనతో భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా అదే రోడ్డుపై చేరిన నీటిలోనే పాదచార భక్తులు నడిచి రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శ్రీమఠానికి వెళ్లే దుస్థితి ఉంది. ఇటీవల లాడ్జీలు, హోటళ్ల సంఖ్య మరింత పెరగడంతో సమస్య జఠిలంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ ద్వారా మురుగునీరు వెళ్లే అవకాశం లేక బ్లాక్ కావడంతో పంచాయతీ సిబ్బంది బ్లాక్‌లను తొలగించడం పరిపాటిగా మారింది. ప్రతి గురు, శని, ఆదివారాలు ప్రధాన రహదారి భక్తులతో రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ సెలవులు వచ్చాయంటే రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. అలాంటి సందర్భాల్లో మంత్రాలయంలోని ప్రధాన రహదారిలో శ్రీమఠం ప్రధాన ఆర్చి వద్ద డ్రైనేజీ నీటి వల్ల ముక్కులు మూసుకొని వెళ్లక తప్పడం లేదు. పేరుకేమో దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది. మంత్రాలయం పేరు గొప్ప ఊరు దిబ్బలా మారింది. ఇలాంటి పరిస్థితి నుంచి ఉపశమనం కలిగించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రైనేజీ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

అధికారులు మారినా..
మారని నేమ్ బోర్డులు...

ప్రజాశక్తి - హాలహర్వి



హాలహర్వి తహశీల్దార్ కార్యాలయంలో విధులు అధికారులు మారినా.. వారి పేరు మీద ఉన్న నేమ్ బోర్డులు మాత్రం మార్చలేదు. తహశీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు అధికారులు అందుబాటులో లేని సమయంలో అక్కడే ఉన్న నేమ్ బోర్డులో ఫోన్ నెంబర్లకు ఫోన్ చేస్తున్నారు. ఒకవేళ స్పందించినా తాము వేరే మండలానికి బదిలీపై వచ్చామని సమాచారం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి చెప్పాలో అర్థం కాక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాలహర్వి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున ఆరు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అయినా తహశీల్దార్ కార్యాలయంలో మాత్రం ఆయన పేరుతోనే నేమ్ బోర్డులు దర్శనమిస్తుండడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి నేమ్‌బోర్డులో పేర్లు మార్చడంతోపాటు ఫోన్ నెంబర్లు కూడా మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సిబ్బందికి సమాచార హక్కు చట్టంలోని పలు అంశాలపై ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యాలయంలో అప్పిలేట్ అధికారి, సహాయ పీలేరు అధికారి పేర్లు అందరికీ కనిపించేలా ప్రదర్శించామన్నారు. అర్జీదారులు ఎవరైనా సమాచారం కోసం కార్యాలయాన్ని సంప్రదిస్తే కార్యాలయంలో ఉన్న సమాచారం మేరకు 30 రోజుల గడువులోపు తగిన సమాచారాన్ని అందిస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు షఫీ, మహేంద్ర పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలు పరిష్కరిస్తాం!

- తహశీల్దార్ సతీష్

ప్రజాశక్తి - హొళగుంద

భూమి రీసర్వే సమస్యలు, అభ్యంతరాలుంటే పరిష్కరిస్తామని తహశీల్దార్ సతీష్ తెలిపారు. బుధవారం మండలంలోని ముద్దటమాగి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ రీసర్వేలో అనుమానాలు, అభ్యంతరాలు వినతి రూపంలో తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి రికార్డునూ పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావు పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని వగరూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై 138 వినతులు వచ్చినట్లు తహశీల్దార్ ఎస్.రవి తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు, ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, విఆర్ఒ ఆనందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని కోటేకల్లు గ్రామంలో 7వ తరగతి చదువుతున్న జి.రాజేష్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు భీమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు ఉమాపతి తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27 వరకు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే అండర్-14 పోటీలకు జి.రాజేష్ ఎంపికయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులు విజయ లక్ష్మి, గంగాధర్, లక్ష్మన్న, నాగరాజు, రమేష్, రామాంజనేయులు, గణపతి, మల్లికార్జున, హసీనా పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

- జింకల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- జెడిఎ వరలక్ష్మి

ప్రజాశక్తి - ఆలూరు

రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జెడిఎ వరలక్ష్మి తెలిపారు. జింకల సమస్యను పరిష్కరించాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జెడిఎ వరలక్ష్మి దష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో జింకల బెడద తీవ్రంగా ఉందని, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నారాయణ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా జెడిఎ మాట్లాడుతూ... జింకల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీఇచ్చారు. జింకల పార్కు అంశంపై అధ్యయనం చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఎరువులు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, పప్పు శనగ విత్తనం వేసే రైతులు విరామం ఇవ్వాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు, సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఎడిఎ సునీత, ఎఒ వెంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న జెడిఎ వరలక్ష్మి

హాలహర్వి : మండలంలోని గూళ్యం గ్రామంలో ఎరువుల దుకాణాల్లో జెడిఎ వరలక్ష్మి బుధవారం తనిఖీలు చేపట్టారు. అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న కామధేను ఫర్టిలైజర్ దుకాణ యజమానికి నోటీసులు ఇచ్చారు. వాసవీ ఫర్టిలైజర్ దుకాణంలోనూ తనిఖీలు చేపట్టారు.

జెడి రాకతో మూతపడిన ఎరువుల దుకాణాలు

హాలహర్విలో మూతపడిన దుకాణాలు

మండలంలోని గూళ్యం గ్రామానికి జెడిఎ వరలక్ష్మి వస్తారని ముందస్తు సమాచారం రావడంతో ఉదయం నుంచి ఎరువుల దుకాణాలు మూతపడ్డాయి. ఎరువులు, ఫర్టిలైజర్‌ను అధిక ధరలకు అమ్ముతున్నారని తనిఖీలు చేపట్టారు. బయో మందులు, ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిసింది. గ్రామంలో దాదాపు 30 దుకాణాలకు గాను రెండు మాత్రమే తెరచుకున్నాయి. మిగతావన్నీ మూతపడ్డాయి.

ఆస్పరిలోని శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపును జెడిఎ వరలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు, నీళ్ల మందులు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని ఫర్టిలైజర్ యజమానులను హెచ్చరించారు. రికార్డులను పరిశీలించగా షాపులో ఉన్న జి2 బయో మందుల స్టాక్‌ను చూపించక పోవడంతో లోపలికి వెళ్లి తనిఖీ చేశారు. రూ.48,800 విలువ గల జి2 బయో మందులు అమ్మడానికి వీల్లేదని ఆదేశాలు ఇచ్చారు. ఆలూరు ఎడిఎ సునీత, ఎఒ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆస్పరిలో రికార్డులను పరిశీలిస్తున్న జెడిఎ వరలక్ష్మి

అక్రమాలను ప్రశ్నిస్తే కక్ష సాధింపులు తగదు

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో కూటమి నాయకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే తమపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచిందని, రాజకీయ విమర్శలను తట్టుకోలేని పరిస్థితిలో నాయకులు ఉన్నారని మండిపడ్డారు. ఆదోనిలో వెలుగు చూసినా భూ కబ్జా విషయంపై మీడియా ముఖంగా విమర్శించినందుకు కూటమి నాయకులు తనపై కక్ష పెంచుకున్నారని తెలిపారు. కూటమిలోనే మూడు పార్టీల నాయకులు కండువాలు ధరించి ఆదోనిలోని వంశీ చైతన్య నర్సింగ్ హోమ్‌కు వచ్చి పరిశీలిస్తున్నామని చెప్పడం వారికి ఏ హక్కు ఉందని నిలదీశారు. వినాయక చవితి చందాకు ఈ తరహాలో వచ్చేవారని, అందుకే ఆస్పత్రిలోకి అనుమతి ఇచ్చామని తెలిపారు. మహిళలు ఉండే ఆస్పత్రికి సమూహంగా రావడం వల్ల భయాందోళనకు గురయ్యారని అన్నారు. ఇన్నేళ్ల చరిత్రలో ఆదోనిలో ఇలా వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం ఏ నాయకుడూ చేయలేదన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి అవలంభిస్తున్న పాలన విధానాల్లో తప్పిదాలను తాను కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ హోదాలో ఎత్తి చూపానని, వ్యక్తిగతంగా ఏ రోజూ దూషించలేదని తెలిపారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక ఆస్పత్రిపై దుష్ప్రచారానికి దిగడం తగదన్నారు. ఎన్నో సమస్యలు ఉన్నాయని, దమ్ము, ధైర్యం ఉంటే అన్ని ఆస్పత్రులను సందర్శించి పరిష్కారం చూపగలరా అంటూ ప్రశ్నించారు. వ్యక్తిగత కక్షలు మానుకొని రాజకీయంగా మసలుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం ప్రతిపక్ష పాత్ర తీసుకొని ప్రతి అంశంలోనూ తప్పులను ఎండగడతామని తెలిపారు. ప్రజల కోసం తాము పోరాటానికి సిద్ధమని, భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ దోకా, నాయకులు సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, నాయకులు మారుతి రావు, శ్రీనిత్, హుస్సేనప్ప యాదవ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

'పరిశుభ్రతలో భాగ్యస్వాములు కావాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ప్రజలు, తోపుడు బండ్ల వ్యాపారులు పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా జయ వర్ధన్, శానిటరీ సిబ్బంది లక్ష్మన్న తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి సూచనలు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు ప్రధాన కూడలిలో తోపుడు బండ్ల వ్యాపారులకు చెత్త బుట్టలు అందజేశారు. ఎవరైనా చెత్తను ఆరుబయట వేస్తే అపరాధ రుసుం రూ.1000 విధిస్తామని హెచ్చరించారు.

'ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎఐటియుసి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మగురుడు, వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ మీటర్ రీడర్స్ నాయకులు నరసింహ, ఉరుకుంద, శేఖర్, నరసప్ప, ఖాజా, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, రామాంజనేయులు, శ్రీరామ్, ఖాదర్, సమీర్, మల్లికార్జున గౌడ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని వారికి నోటీసులు

- రూ.15 కోట్లు సేకరించడమే లక్ష్యం
- మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్నులు సక్రమంగా చెల్లించని వారిని గుర్తించి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.15 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.5.15 కోట్లు సేకరించామన్నారు. వార్డుల వారీగా సచివాలయ ఉద్యోగులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి లక్ష్యాలు ఇచ్చామని తెలిపారు. సక్రమంగా చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న 1600 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించడం వల్ల కలిగే వెసులుబాటు గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పన్నులు చెల్లించిన వారు తప్పకుండా రసీదు పొందాలన్నారు. మున్సిపల్ దుకాణాల్లో వ్యాపారం, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు కూడా ప్రతి నెలా తప్పకుండా అద్దె చెల్లించాలని సూచించారు. అందులో కూడా మొండిగా వ్యవహరించే వారిని గుర్తించి ఇప్పటికే మౌఖికంగా చెప్పినట్లు తెలిపారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ కాంట్రాక్టు దారులు అప్పు బకాయి ఉందన్నారు. చెల్లించాలని ఇద్దరు వ్యక్తులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. రూ.5 లక్షలు చెల్లించారని, ఇంకా మిగతా మొత్తాన్ని త్వరలో చెల్లిస్తామని చెప్పారని అన్నారు. కుళాయి పన్ను చెల్లించని వారిని గుర్తించామని, అలాంటి వారికి నీటి సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. సకాలంలో పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి కౌసర్ భానుకు బుధవారం సరస్వతి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన పి.మహబూబ్ టీ స్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. అతని రెండో కుమార్తె పి.కౌసర్ భాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరీక్షలు చేయించగా క్యాన్సర్ వ్యాధిగా నిర్ధారించారు. ఆర్థికంగా వారి కుటుంబం చాలా వెనుకబడి ఉంది. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించినా ఖర్చులు, మందులకు కూడా అవసరమయ్యే డబ్బు లేక, ఎవరినీ అడగలేక ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించి సరస్వతి విద్యానికేతన్ సిబ్బంది, యాజమాన్యం తమ వంతు సహాయంగా రూ.15 వేలు అందించారు. విద్యార్థికి ఆరోగ్యం కుదుటపడే వరకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. పాఠశాల కరస్పాండెంట్లు కృష్ణమూర్తి, ముజ్బుర్ రహిమాన్, నజీర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు కర్నూలు అట్ ఆదోని

A.S.No. 21/2020

Between:
జి.సరోజమ్మ మరియు ఇతరులు. ...అప్పెటెంట్స్
V/S
జి.ఈరన్న died by L.Rs..
Respondents No.2 to 14. ...రెస్పాండెంట్స్

అప్పీల్ నోటీస్ టు రెస్పాండెంట్స్ నెం.9 నుండి 13

1) Hanumamma , D/o late G. Eranna, age 53 years (R9)
2) Bhagyamma, D/o late G. Erarina, age 46 years (R10)
3) Jayalakshmi, D/o late G. Eranna, age 43 years (R11)
4) Varalakshmi, D/o late G. Eranna, age 39 years (R12)
5) Shanthamma, D/o late G. Eranna, age 34 years (R13)

All are resident of 111-Madire Village, Adoni Mandal, Kurnool District.

పై తెలిపిన అప్పిలెంట్స్ వారు రెస్పాండెంట్ నెం.1 జి. ఈరన్న మరణించినందున అతని వారసులైన రెస్పాండెంట్స్ (R 9 to R13) అయిన మీకు పై కోర్టు నుండి చాలా సార్లు I.A.No.28 OF 2024, I.A.No.29 OF 2024, I.A.No.30 OF 2024 నందు నోటీసులు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయదమేమనగా పై తెలిసిన అప్పిల్ వాయిదా తేది:12-11-2024 ఉదయం 10.30 గంటలకు రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు ముందు హాజరు కావలెనని, మీ తరపున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు ఖుద్దుగా గాని, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. రెస్పాండెంట్స్ అయిన మీరు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో అప్పిలెంట్ పరముగా మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడ మైనది.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

వాయిదా తేది : 12-11-2024

శ్రీ కె. విరుపాక్ష రెడ్డి,
అప్పిలెంట్స్ తరపు వకీలు,
ఆదోని -518301.
ఫోన్ : 9441054806

ADONI MUNICIPALITY

Roc.No.13/2024-25-E1 **e-Procurement Tender Notice** **Dated : 22-10-2024.**

Invites Tender Notice under SAC Funds and General Funds 2024-25 (Sl.no. 1 to20)
Down loading Start date and Time : 24.10.2024 @ 10.00 AM
Down loading End date and Time : 11.11.2024 @ 3.00 PM
Invites Tender Notice under General Funds 2024-25 (Sl.no.21)
Down loading Start date and Time : 24.10.2024 @ 10.00 AM
Down loading End date and Time : 28.10.2024 @ 3.00 PM
For further details the tenderer may visit e-procurement platform on **www.tender.apeprocurement.gov.in.** or Cell No.98499 05859

Commissioner, Adoni Municipality.